

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## మదర్ ఇండియా

**భాష:** హిందీ, **కథ:** సుబోద్ ఘోష్, **దర్శకత్వం:** మహబూబ్;
**నటీనటులు:** నర్గీస్ (నాథ), సునీల్ దత్ (బిర్జు), రాజేంద్రకుమార్; రాజ్ కుమార్
**విడుదల:** 1957




**భారతీయ సమాజంలో** 'మాతృమూర్తి' స్థానానికి మహోన్నతమైన విలువ ఉంది. భావ ప్రపంచంలోనూ అన్ని సాహితీ కళారూపాల్లోనూ 'అమ్మ' పాత్రకి ఎనలేని గౌరవమూ పూజనీయమైన స్థానమూ అపాదించబడ్డాయి. దేవతా స్థానాన్నిచ్చి కేవలం కుటుంబానికే పరిమితం చేయకుండా అమ్మ అంటే మొత్తం ఊరుకూ, జాతికే తల్లి అన్న భావాన్ని కూడా రూపుదిద్దారు. అలాంటి ఒక భావనా ప్రపంచపు మాతృమూర్తి పాత్రను ముఖ్య అభినేతగా చేసి 53 ఏళ్ళ క్రితం మహబూబ్ ఓ చిత్రం నిర్మించాడు. అది నాటికీ నేటికీ విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచిపోయింది. అంతే కాదు, ఆ చిత్రం తర్వాత అందులోని పాత్రలకు మొత్తం చిత్రానికే అనేక అనుకరణలూ, కొనసాగింపులూ భారతీయ సినిమా రంగంలో వెలువడ్డాయి. నర్గీస్‌లోని ఓ మహానటిని ఆ సినిమా ఆవిష్కరించింది. ఆ సినిమా 'మదర్ ఇండియా'.

అంతకుముందు పదిహేడేళ్ళ క్రితం మహబూబ్ తానే 'ఔరత్' చిత్రాన్ని నిర్మించాడు. అందులో సర్దార్ అఖ్తర్ ప్రధాన భూమికను పోషించగా అది గొప్ప విజయాన్ని సాధించింది. సరిగ్గా అదే సినిమాని మళ్ళీ మహబూబ్ 'మదర్ ఇండియా'గా తీశాడు. అయితే దీనిలో తల్లి పాత్రకి కొంత కొనసాగింపు ఉంది. 'మదర్ ఇండియా' ప్రధానంగా నర్గీస్ పోషించిన తల్లి పాత్ర రాధ జీవనపోరాటాన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని నిర్మించబడినప్పటికీ అది కేవలం ఆమె జీవిత చరిత్ర మాత్రమే కాదు. అది ఆనాటి సామాజిక, ఆర్థిక జీవన చిత్రం కూడా. అప్పటికే విశృంఖలమవుతున్న డబ్బు ప్రభావమూ, కూలిపోతున్న వ్యవసాయ రంగ స్థితిగతులూ, విచ్ఛిన్నమైపోతున్న రైతుల బతుకు అన్నీ కలగలిపి మదర్ ఇండియాగా రూపుదిద్దుకున్నాయి. ప్రకృతి వనరులపైన ఆధారపడి సాగుతున్న భారతీయ వ్యవసాయ రంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతు తాను నమ్ముకున్న భూమిని ఎలా పరాయిపరం చేయాల్సి వచ్చిందో, రైతు ఎలా కరిగిపోతున్నాడో మదర్ ఇండియాలో స్పష్టంగా చిత్రించారు. డబ్బు, అధికారం, వడ్డీ వ్యాపారం జులుం భూమిని ఎలా కబళించిందీ క్రమంగా రైతు జీవితాన్నే ఎలా బలిగొంది ఈ చిత్రం వివరిస్తుంది. కుటుంబం కూలిపోయిన స్థితి నుంచి రాధ తిరిగి మట్టినే నమ్ముకుని శ్రమనే పెట్టుబడిగా పెట్టి, పలాయనం చిత్తగించనున్న ఊరికి స్ఫూర్తినిచ్చి తిరిగి తన కాళ్ళపైన తనకుటుంబాన్ని, వ్యవసాయాన్ని నిలుపుతుంది.



ఆ స్థితిలో రాధ శక్తి స్వరూపిణిగా తన పిల్లలకే కాదు మొత్తం ఊరికే తల్లిగా ఎదుగుతుంది. కానీ రాధ కొడుకుల్లో ఒకడైన బిర్జు తన తల్లి కష్టాలకు మూలకారణమైన వడ్డీ వ్యాపారిపై పగ సాధించడానికి, అనేక సంవత్సరాలుగా తమ శ్రమని వడ్డీగా దోచుకుంటున్న వాడి కోటను బద్దలు కొట్టడానికి ఎదురు తిరిగినపుడు ఆ రాధే బిర్జును నిలువరిస్తుంది. ఊరుకోసం, మాట నిలుపుకోవడం కోసం వడ్డీ వ్యాపారి కూతురికి అన్యాయం జరగరాదన్న భావన కోసం సొంత కొడుకునే కాల్చి చంపుతుంది. చిత్రం మౌలిక సమస్యదాకా వచ్చి సినిమాటిక్ ముగింపుతో తేలిపోతుంది. ప్రేక్షకుల ఎమోషన్స్‌ని తడమడంతో గొప్ప రెస్పాన్స్‌ని అందుకుని విజవంతమైన సినిమాగా మిగిలిపోయింది.

'మదర్ ఇండియా'లో ప్రధాన పాత్ర రాధకు పౌరాణిక పాత్రల లక్షణాల్ని కూడా సంతరింపజేశారు. పేరుకు రాధ అయినప్పటికీ సీతకుండే సాధ్వీ లక్షణాల్ని సచ్ఛీలతనూ ఆప్యాయతను కలిగి ఉంది. వడ్డీ వ్యాపారి ఆమెను బలాత్కారం చేయాలనుకున్నప్పుడు కాళీమాతలాగా ఎదురు తిరిగి ధైర్యాన్ని ప్రదర్శిస్తుంది. శక్తి స్వరూపిణిగా కష్టాలని ఎదురొడ్డి నిలుస్తుంది రాధ. ఊరుకోసం తన స్వంత కొడుకునే హత్య చేసి ఆమె భూదేవిలాగా త్యాగం చేసినట్టు నిలుస్తుంది.

చిత్రకథాంశం విషయానికి వస్తే రాధ పెళ్ళయిం తర్వాత భర్త ఊరికి వస్తుంది. ఆమె భర్త శ్యాములు మంచి కష్టించి పనిచేయగలిగిన రైతు. జీవితం పట్ల గొప్ప ఆశలు కలిగినవాడు. రాధ తనింటి పనులతో పాటు భర్తకు తోడుగా వ్యవసాయపనులూ నిర్వర్తిస్తూ ఉంటుంది. వాళ్ళ పెళ్ళికోసం చేసిన అప్పులు వారిముందున్న ప్రధాన సమస్య వడ్డీ వ్యాపారి ఆ ఊరి భూస్వామి సుఖీలాలాకు తమ భూమిని తనకా పెడుతుంది శ్యాములు తల్లి. రాధకి మొదటి కొడుకు పుడతాడు. ఆనందం వెల్లివిరుస్తుంది. అదే క్రమంలో మరిద్దరు పిల్లలు అయ్యేసరికి అప్పులు పెరిగిపోతాయి. అందిన పంట వడ్డీలకే సరిపోదు. లాలా జులుం మరింత పెరిగిపోతుంది. శ్యాము ఎంత కష్టపడ్డా ఫలితం ఉండదు. వారి ఎద్దు చనిపోవడంతో కష్టాలు రెట్టింపవుతాయి. లాలా నుంచి మరింత అప్పు తీసుకోవడానికి శ్యాములు అంగీకరించడు. కాని రాధ తన పెళ్ళి నాటి ఆభరణాలు తనఖా పెట్టి మరో ఎద్దును కొంటారు. వ్యవసాయం మెరుగుపరచే క్రమంలో బావి తవ్వకాన్ని ఆరంభించి బండను తొలిగించే ప్రయత్నంలో శ్యాము రెండు చేతులూ పోగొట్టుకుంటాడు. దుఃఖంతో శ్యాము ఇంట్లో ఉంటే రాధ ఇంటి బాధ్యతలు స్వీకరిస్తుంది. లాలా చేసిన ఎగతాళిని భరించలేక అవిటి బతుకును కొనసాగించలేక ఓ రాత్రి

నుదుటి బొట్టును చెరిపేసి శ్యాములు ఇంట్లోంచి వెళ్ళిపోతాడు. నలుగురు పిల్లలతో రాధ ఒంటరిగా మిగులుతుంది. వడ్డీ వ్యాపారి లాలా రాధను తనతో ఉండమంటాడు. మొత్తం కుటుంబం బాధ్యతను తీసుకుంటానంటాడు. ఆమె అంగీకరించదు. కాని తుఫాను వరదలొచ్చి సర్వం కొట్టుకుపోగా ఇద్దరు పిల్లల మరణాన్ని చూసి రాధ కదిలిపోతుంది. ఆకలికి విలవిల్లాడుతున్న మిగిలిన పిల్లల్ని చూసి, వారికోసం లాలాకు లొంగిపోవడానికి వెళుతుంది. కాని చివరి నిమిషం తనను తాను సంబాళించుకుని వాడిని ఎదిరించి కొట్టి బయటపడుతుంది. వరదలకి అంతా కొట్టుకుపోగా ఊరంతా వలసకు సిద్ధమవుతారు. కాని రాధ తన భూమినే నమ్ముకుంటానని ఊరుని విడిచి వెళ్ళనంటుంది. ఊరివాళ్ళనందరినీ నిలవరిస్తుంది.

తర్వాత అష్టకష్టాలుపడి తన వ్యవసాయాన్ని, పిల్లల్ని పెంచుతుంది. కొడుకులిద్దరూ రామూ, బిర్జూ ఎదుగుతారు. బిర్జు తన తల్లిపడ్డ కష్టాల్ని కన్నీళ్ళని దగ్గరనుంచి చూసి లాలాపైన అతని చర్యలపైన వ్యతిరేకతను పెంచుకుంటాడు. వడ్డీకోసం పంటను ఊడ్చుకెళ్ళేందుకు వచ్చిన లాలాను లెక్క చెప్పమంటాడు. తన చదువురాని స్థితికి దుఃఖపడుతాడు. లాలాపై పగతీర్చుకునే ప్రయత్నంలోనూ లాలా వద్దవున్న తన తల్లి కంగన్‌ను తిరిగి తెచ్చే ప్రయత్నంలోనూ లాలానుంచి, ఊరునుంచి వ్యతిరేకతకు గురై బహిష్కరించ బడతాడు. ఊరు వదిలిన బిర్జూ డాకూ అవుతాడు. లాలా ఇంటిపై దాడిచేసి అతని వడ్డీ కాగితాలన్నింటినీ తగలపెడతాడు. అతని కూతురిని ఎత్తుకెళ్ళిపోతుండగా అప్పటికే బిర్జూనుంచి ఊరికెలాంటి ఆపద రాకుండా చూస్తానని మాట ఇచ్చిన రాధ బిర్జూని తుపాకితో కాల్చివేసుంది. బిర్జూ తల్లి వడిలో ప్రాణం విడుస్తాడు. బిర్జూ చేతిలోంచి రక్తంలో తడిచిన రాధ కంగన్ జారిపడుతుంది. చిత్రం భావోద్వేగంతో ముగుస్తుంది.

చిత్రీకరణ విషయంలో కూడా మదర్ ఇండియా అనేక కొత్తకోణాల్ని చూపించింది. రాధగా నర్గీస్, బిర్జుగా సునీల్‌దత్ అద్వితీయమైన నటనను ప్రదర్శించారు. ఈ చితంలో నటనకు నర్గీస్‌కు పదకొండవ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఉత్తమనటి అవార్డు లభించింది. నాటి నుంచి నేటిదాకా మదర్ ఇండియా విశిష్టమైన సినిమాగా మిగిలిపోయింది. మహబూబ్, నర్గీస్‌లు మదర్ ఇండియాతో భారతీయ చలన చిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

✡✡✡

# స్వర్గసీమ

**కథ, మాటలు - చక్రపాణి, సంగీతం - నాగయ్య, దర్శకత్వం: బి.ఎన్.రెడ్డి;**
**కెమెరా - మార్కస్ బార్‌ట్లే, విడుదల:** 1945
**నటీనటులు:** నాగయ్య, భానుమతి, జయమ్మ, లింగమూర్తి, నారాయణరావు, శివరావు.




**ఆరున్నర దశాబ్దాల** క్రితమే సామాజిక విలువల గురించి, పురుషుడిలో పొడసూపే వివాహేతర సంబంధాల గురించి, కుటుంబ సంబంధ విలువల గురించి చర్చించి వివరించే కళాత్మకమైన చిత్రాన్ని బి.ఎన్.రెడ్డి నిర్మించారు. ఆ కాలంలో హీరోకి చెడు లక్షణాల్ని ఆపాదించి చిత్రం నిర్మించడమే పెద్ద సాహసం, అంతేకాకుండా ఒక స్త్రీ మంచి అవకాశాలు రావడం కోసం తన కెరీర్‌ను నిర్మించడం కోసం ఒక వ్యక్తిని నిచ్చనగా వాడుకుని, ప్రేమించి, లాలించి, ఆ తర్వాత వదిలించిన వైనాన్ని స్వర్గసీమలో బి.ఎన్. అత్యంత ప్రతిభావంతంగా చిత్రించారు.

వివాహేతర సంబంధాలలో అవకాశవాద ముంటుందని వివాహ సంబంధమూ అందులోని ప్రేమలే శాశ్వతమైన సత్యాలని ఈ చిత్రం ద్వారా బి.ఎన్. ప్రబోధిస్తారు. కాని ఆనాటి కాలానికంటే ఎంతో ముందుకాలాన్ని విజువలైజ్ చేసి పాత్రల్ని రూపొందించడంలో బి.ఎన్. గొప్పదనం ఇమిడి ఉంది. ఇందులో భానుమతి ప్రధాన పాత్రను పోషించి, విశేషమైన పేరు ప్రఖ్యాతుల్ని అందుకుంది. విమర్శకుల చేత గొప్ప ప్రశంసలందుకున్న ఆమె, ఆ తర్వాత తన కెరీర్‌లో తిరిగి వెనక్కి చూడలేదనడంలో అతిశయోక్తిలేదు. విషయపరంగానూ, పాత్రల రూపకల్పన పరంగానూ మాత్రమే కాకుండా, బి.ఎన్. ఈ చిత్రం తీసిన సమయం వ్యక్తిగా ఆయనకు ప్రతికూలమైన కాలం. అంతేకాదు. ఆనాటి సామాజిక ఆర్థిక రంగాల్లో కూడా రెండవ ప్రపంచ యుద్ధపు ప్రభావాలచేత అతలాకుతలమవుతున్న కాలమది. ముడి ఫిలింతో సహా అన్నింటి దిగుమతుల విషయంలోనూ ఆంక్షలు. రేషన్లు అమలులో ఉన్నకాలం. అందుకే కేవలం పదకొండువేల అడుగుల లోపే చిత్ర నిడివిని కుదించుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ బి.ఎన్. తన ప్రణాళికాబద్ధమైన నిర్మాణ రీతిలో 'స్వర్గసీమ'ను పూర్తిచేశారు. బి.ఎన్.రెడ్డితో మమేకమై అప్పటిదాకా నిర్మించిన అన్ని చిత్రాల్లో చేదోడు వాదోడుగా ఉన్న రామనాథ్, శేఖర్‌లు ఇద్దరూ బి.ఎన్.రెడ్డి నుంచి విడిపడి ఎస్.ఎన్.వాసన్ గారి జెమినీలో చేరిపోయారు. ఆ ఇద్దరూ లేకుండా బి.ఎన్ చిత్రం నిర్మించడం సాధ్యం కాదని భావించి అనుమానాలు వ్యక్తం చేయడంతో బి.ఎన్. తన ప్రతిభకు సవాల్‌గా తీసుకుని 'స్వర్గసీమ' చిత్రనిర్మాణం చేపట్టారు. రచయితగా బి.ఎన్. తమ వాహిని సంస్థలోకి చక్రపాణి (ఎ.వి. సుబ్బారావు)ని చేర్చారు. అప్పటికే మంచి రచయితగా పేరున్న చక్రపాణి స్వర్గసీమతో వాహినికి వెన్నెముక అయి ఉండిపోయారు. ఇక ఫోటోగ్రాఫర్‌గా ఆంగ్లో ఇండియన్ మార్కస్ బార్ట్లేను స్వర్గసీమతోనే పరిచయం చేశారు. అంతేకాకుండా ఘంటసాలను కూడా స్వర్గసీమతోనే పరిచయం చేశారు. గాయకుడిగా ఘంటసాలకు స్వర్గసీమ చిత్రమే గొప్ప బ్రేక్‌ని ఇచ్చింది. ఇలా పలుప్రయోగా లు వినూత్న ముఖాలతో కూడి నిర్మితమైన స్వర్గసీమ గొప్ప విజయాన్ని సాధించింది. 'ఓ పావురమా'లాంటి పాటలతో ఆ చిత్రం తెలుగువారి స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.




కథాంశం విషయానికి వస్తే అందమైన పేద యువతి సుబ్బి ఆ పట్టణంలో ఓ మూల నివసిస్తూ ఉంటుంది. ఆటపాటలతో పాటు చొచ్చుకుని పోగల ప్రతిభగల ఆ యువతి మంచి జీవితం పొందాలని భావిస్తూ ఉంటుంది. మూర్తి, కళ్యాణి ఇద్దరూ భార్యాభర్తలు. ఇద్దరు సంతానంతో సాఫీగా వారి జీవితం సాగిపోతూ ఉంటుంది. మూర్తి సుబ్బిని కలిసి ఆమె ఎదుగుదలకు సహాయపడతాడు. ఆమె పేరు సుబ్బి నుంచి సుబ్బలక్ష్మి, సుజాత - సుజాతాదేవిగా మారేస్థితి వరకు ఆమె వెంటే ఉంటాడు. ఆమె కూడా మూర్తే సర్వస్వంగా ప్రవర్తిస్తుంది. మూర్తి తన భార్యాపిల్లల్ని వదిలేసి సుజాతాదేవితో ఉండిపోతాడు. భర్తను కలవడానికి వెళ్ళిన కళ్యాణి అవమానానికి గురై కుమిలిపోతుంది. ఆకలి పేదరికం తోడుగా మిగిలిపోతుంది. కొంతకాలం గడిచాక సుజాతాదేవికి మూర్తిపట్ల మోజు తగ్గిపోతుంది. కొత్త మనిషిని, సరికొత్త ప్రేమికుడిని ఆమె కాంక్షిస్తుంది. క్రమంగా మూర్తిని తన జీవితంలోంచి తప్పిస్తుంది. కొత్త ప్రేమికుడితో సహజీవనం ఆరంభిస్తుంది. తనకాళ్ళకింది నేల కదిలిపోగా మూర్తి నిర్వీర్యుడైపోతాడు. కలలన్నీ, భ్రమలైపోగా ఒంటరిగా మిగిలిపోతాడు. స్త్రీ పురుషుల నడుమ పెరిగే అవకాశవాద బంధాల్ని చర్చిస్తూనే, కుటుంబ బంధాలే శాశ్వతమైనవని ప్రభోదిస్తూ సినిమా సాగుతుంది.

మొత్తం మీద స్త్రీ పురుష సంబంధాల్ని చర్చించి ప్రభోదాత్మక చిత్రంగా నిలిచిన స్వర్గసీమ ఆ కాలంలో విశేష ప్రజాదరణని కూడా పొందింది. ఒక మంచి చిత్రంగా తెలుగు చలన చిత్ర చరిత్రలో మిగిలిపోయింది.

✡✡✡